విష జ్వరాలతో మహబూబాబాద్ జిల్లా వైద్యశాలలో చికిత్సపొందుతున్న ప్రజలు

సర్కారు దవాఖానలకు రోగుల తాకిడి

- ఎంజీఎంలో అందుబాటులో లేని ప్రత్యేక ఫీవర్ వార్డు
- ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఆస్పత్రుల కిటకిట
- దవాఖానల్లో మందుల కొరత
- పట్టించుకోని వైద్యాధికారులు

వరంగల్ చౌరస్తా/ములుగు/మహబూబాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): సుమారు 10 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, సీజనల్ వ్యాధులతో ప్రజలు రోగాల బారిన పడి సర్కారు దవాఖానలకు పోటెత్తుతున్నారు. వైరల్, సీజనల్ వ్యాధులతో వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. వాతావరణ మార్పులతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానకు వస్తున్నారు. దీంతో దవాఖానలోని వార్డులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం దవాఖానలో 56 మంది డెంగీ లక్షణాలతో, మరో 52 మంది వైరల్ ఫీవర్ (విషజ్వరం)తో, ఇద్దరు మలేరియాతో చికిత్స పొందుతున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. గతంలో విషజ్వరాలు ప్రబలడంతో బాధితులకు మెరుగైన చికిత్సను అందించడానికి కార్డియాలజీ విభాగానికి ఆనుకొని ఫీవర్ వార్డును ఏర్పాటు చేశారు. ప్రత్యేక వార్డు ఏర్పాటుతో రోగులకు సైతం మెరుగైన సేవలు అందాయి. ప్రస్తుతం ఎంజీఎంలో వందకు పైగా కేసులు నమోదవుతున్నా ప్రత్యేక వార్డుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ములుగు జిల్లాలో ప్రభుత్వ దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానతోపాటు ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) సామాజిక వైద్యశాలల్లో బెడ్స్ నిండిపోయాయి. ములుగు దవాఖానలో ఏర్పాటు చేసిన ఐసీయూలో 10 బెడ్లు ఉండగా, రోజా రోగులతో నిండిపోతున్నది. దీంతో ఐసీయూ బెడ్ల కోసం రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి. వైద్యులు రాసిన అన్ని మందులు ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో లేక ఉన్న వాటితోనే సరిపెడుతున్నారు. మరికొందరికి బయట కొనుక్కోవాలని సూచిస్తున్నారు. ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలలో మందుల కొరత తీవ్రంగా ఉంది. చిన్న పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్‌లు కూడా తగినంతగా అందుబాటులో లేవు. జిల్లాలోని అన్ని ప్రాథమిక కేంద్రాలు, పల్లె దవాఖానల్లో సైతం సరిపడా మందులు లేవు. దీంతో ప్రజలు ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు. డాక్టర్ ఫీజుతోపాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, డాక్టర్లు రాసే మందులకు వేలాదిగా ఖర్చు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంలో కుటుంబ సభ్యులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతున్నాయి.

మహానంది గోశాల వద్ద చిరుత సంచారం

ఆందోళనలో భక్తులు, స్థానికులు

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ) నంద్యాల జిల్లా మహానంది క్షేత్రం గోశాల వద్ద చిరుత సంచారం కలకలం సృష్టిస్తోంది. శనివారం ఉపాలయం వద్ద చిరుత రాకను గమనించిన సెక్యూరిటీ గార్డులు కేకలు వేయడంతో అక్కడి నుంచి సమీప అటవీప్రాంతంలోకి పారిపోయింది. ఇటీవల చిరుత ఆరుసార్లు ఆలయ సమీపంలోకి రావడం పట్ల భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల 18న పాతాళగంగ పాత మెట్ల వైపు చిరుత సంచారాన్ని గమనించిన భక్తులు ఆలయ అధికారులకు సమాచారం అందించారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో పలుమార్లు చిరుత సంచరించగా అటవీ శాఖ అధికారులు డోలు శబ్దాలు చేయించడంతో పారిపోయింది. చిరుత నివాసాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

కొండ నాలుకకు మందేస్తే..!

వైద్యశాఖలో విచక్షణలేని బదిలీలు

- చిన్న దవాఖానలకు పెద్ద డాక్టర్లు!
- రోగులకు శాపంగా మారిన వైద్యుల ట్రాన్స్‌ఫర్లు
- నగరంలోని ప్రధాన టీచింగ్ హాస్పిటళ్లన్నీ ఖాళీ
- 60 శాతానికి పైగా సీనియర్ వైద్యులకు స్థానచలనం
- గాంధీ, ఉస్మానియా వైద్యశాలల్లో నిలిచిన శస్త్రచికిత్సలు
- అనుభవజ్ఞులైన డాక్టర్లు లేక రోగులు ఆగమాగం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ):

- **డాక్టర్ రాజారావు..** జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్. 2020లో కరోనా వంటి విపత్కర సమయంలో గాంధీ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. యావత్తు ప్రపంచం గడగడలాడుతున్న తరుణంలో మహమ్మారి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ రెండువేల పడకలున్న గాంధీ హాస్పిటల్‌ను నిర్వహించారు. కేవలం ఐసీయూలో మాత్రమే ఆక్సిజన్ పడకలు ఉంటే... కరోనా దృష్ట్యా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అన్ని పడకలను ఆక్సిజన్ పడకలుగా మార్చి ఏర్పాట్లు కల్పించింది. క్లిష్టమైన ఆ సమయంలో ఇతర వైద్యులు, సిబ్బంది సహకారంతో రాజారావు సమర్థంగా బాధ్యతలు నిర్వహించడంతో గాంధీ దవాఖాన వేల మంది ప్రాణాలను కాపాడగలిగింది. మరి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఆయనను 200 పడకలున్న భువనగిరి దవాఖానకు బదిలీ చేసింది. రోజుకు 2-3వేల ఓపీ ఉండే దవాఖాన నుంచి ఇప్పుడు ఆయన రోజుకు సుమారు 30 ఓపీ ఉండే దవాఖానలో విధులు నిర్వహిస్తున్నారు.

- **ప్రొఫెసర్ డాక్టర్ నాగేందర్..** జనరల్ సర్జన్. హైదరాబాద్‌లో ఎంతో పురాతనమైన ఉస్మానియా దవాఖానకు రోజూ మూడువేల మంది వరకు రోగులు వస్తుంటారు. ఈ దవాఖానకు 2017లో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా వచ్చిన డాక్టర్ నాగేందర్ 2021 నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. కేసీఆర్ ప్రభుత్వం సర్కారు దవాఖానాల రూపురేఖలు మార్చిన తరుణంలో ఉస్మానియా వైద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయి శస్త్రచికిత్సలకు వేదికగా నిలపడంలో సర్కారు, ఇతర వైద్యులు, సిబ్బంది సహకారాన్ని తీసుకుని ఆయన విజయవంతమయ్యారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ నాగేందర్‌ను కేవలం 30 పడకలున్న (మంజూరు వంద పడకలు) మహేశ్వరం ఏరియా దవాఖానకు బదిలీ చేసింది.

- **డాక్టర్ శంకర్..** జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్. నగరంలో నిరుపేదలకెవరికైనా తీవ్రమైన జ్వరం వచ్చిందంటే గుర్తొచ్చేది కోరంటి (నల్లకుంట ఫీవర్) దవాఖాన. ఈ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా శంకర్ 2012 నుంచి 12 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారు. దశాబ్ద కాలానికి పైగా ఒకే స్థానంలో ఉన్నారంటే ప్రభుత్వాలు ఆయన సేవలు అక్కడ కీలకమని భావించాయి. సీజనల్ వ్యాధులు విజృంభించినపుడు రోజుకు 800 వరకు ఓపీ ఉండే దవాఖానను ఆయన ఎంతో సమర్థంగా నిర్వహించారు. ఇప్పుడు డాక్టర్ శంకర్ రెండు వందల పడకలు ఉన్న జనగాం దవాఖానకు బదిలీ అయ్యారు.

అంతేకాదు మరో ఇద్దరు ప్రొఫెసర్లను కూడా బదిలీ చేయడంతో నల్లకుంట కోరంటి దవాఖానలో ఉన్న మూడుకు మూడు ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. అసలే వారం, పది రోజుల ముసురుతో నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ తరుణంలో నిరుపేదలకు వైద్య సేవలు అందడంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వైద్యుల బదిలీల తీరుకు ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు.

ప్రశ్నార్థకంగా మారిన సేవలు, బోధన

రాష్ట్రంలో ప్రభుత్వం వైద్యశాఖలో చేపట్టిన బదిలీల ప్రక్రియ కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిన చందంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో వేల పడకలున్న దవాఖానల బాధ్యతను సమర్థంగా నిర్వహించిన ప్రొఫెసర్లను జిల్లా కేంద్రాల్లోని చిన్న తరహా దవాఖానలకు బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా.. వైద్యారోగ్యశాఖలో ప్రభుత్వం చేపట్టిన డాక్టర్ల బదిలీలు రోగులకు శాపంగా మారాయి. ప్రభుత్వరంగంలో సూపర్‌స్పెషాలిటీ దవాఖానలైన ఉస్మానియా, గాంధీ, నిలోఫర్‌ల నుంచి సీనియర్ డాక్టర్లందరూ బదిలీ కావడంతో వాటిలోని టీచింగ్ విభాగాలన్నీ దాదాపు ఖాళీ అయ్యాయి. సాధారణ బదిలీల్లో భాగంగా వర్కింగ్ స్టాఫ్‌లో 15 నుంచి 20 శాతం మందిని బదిలీ చేయడం సర్వసాధారణం. కానీ వర్కింగ్ స్టాఫ్‌లో 40 శాతం మందిని బదిలీ చేయాలంటూ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు. అంతేకాకుండా ఉస్మానియా, గాంధీ తదితర దవాఖానల్లో 60 శాతానికి పైగా సీనియర్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. దీంతో అటు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం, ఇటు వైద్య విద్యార్థులకు బోధన ప్రశ్నార్థకంగా మారింది. ఉస్మానియా దవాఖానలో 60 శాతం మంది సీనియర్ వైద్యులు బదిలీ కాగా, గాంధీలో 40 మంది సీనియర్ డాక్టర్లు వేరే చోటకు బదిలీ అయ్యారు. నిలోఫర్‌లో మొత్తం 12 యూనిట్లకు గాను ఒకేసారి 9మంది ప్రొఫెసర్లు బదిలీ కాగా కేవలం ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఇతర దవాఖానల నుంచి బదిలీపై నిలోఫర్‌కు వచ్చారు. దీంతో ప్రస్తుతం నిలోఫర్‌లో ఉన్న 12యూనిట్లకు కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు.

గుడ్డెద్దు చేనులో పడ్డట్టు..

గాంధీ, ఉస్మానియా, ఫీవర్, నిలోఫర్ దవాఖానల్లో బదిలీల ప్రక్రియ నిర్వహించేపుడు ప్రభుత్వం అత్యంత అప్రమత్తత ప్రదర్శించాలి. కానీ గుడ్డెద్దు చేనులో పడ్డట్టు.. ఆయా దవాఖానలపై నిరుపేద రోగులు పెట్టుకున్న నమ్మకం.. సంబంధిత వైద్యుల అనివార్యత.. అంతకుమించి గతంలో వారు అందించిన సేవలను పట్టించుకోకుండా బదిలీల ప్రక్రియను చేపట్టారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వచ్చే రోగుల పరిస్థితి ఏమిటి? వచ్చిన కొత్తవాళ్లు కుదురుకునే వరకు ఏర్పడే ఇబ్బందులు సాధారణ, అమాయక ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉంటాయి. సరిగ్గా ఇక్కడే ప్రభుత్వం, సంబంధిత శాఖ తన ఒడుపు, చాకచక్యాన్ని, విచక్షణను ప్రదర్శించాలి.

తగ్గిన శస్త్రచికిత్సలు...

సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, కోఠి ఈఎన్‌టి తదితర దవాఖానల్లో పలు రకాల శస్త్రచికిత్సలు భారీగా తగ్గిపోయినట్టు సమాచారం. డాక్టర్లు లేరంటూ శస్త్రచికిత్సలు వాయిదా వేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. కొన్ని రకాల సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో సైతం సేవలకు అంతరాయం ఏర్పడుతున్నట్టు రోగులు చెప్తున్నారు.

సీనియర్లు లేకపోతే మా చదువు ఎలా?

సీనియర్ వైద్యనిపుణులు లేకపోతే తమకు వైద్య విద్య బోధన ఎలా అని వైద్యవిద్యార్థులు వాపోతున్నారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో సీనియర్ డాక్టర్లు బదిలీ కావడం తమ చదువుపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత దశలవారీగా వైద్యుల బదిలీలు చేపట్టాల్సిందని వారు అభిప్రాయపడుతున్నారు.

'వైద్య' బదిలీల్లో అక్రమాలపై విజిలెన్స్ విచారణ

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖ బదిలీల్లో అవినీతి ఆరోపణలపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాఖ బదిలీల్లో అక్రమాలు జరిగాయంటూ శనివారం మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని వైద్యశాఖ కార్యదర్శిని ఆదేశించారు. బదిలీల్లో అవకతవకలకు పాల్పడినట్టు తేలితే.. వారు ఏ స్థాయి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

తప్పిదాలు జరిగినట్టు తెలిసింది: డీపీహెచ్

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖలో బదిలీలకు సంబంధించి కొన్ని తప్పిదాలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని డీపీహెచ్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. అయితే వసూళ్ల ఆరోపణలు మాత్రం అవాస్తవమని చెప్పారు. 'వైద్యశాఖ బదిలీల్లో అక్రమాలు' పేరుతో శనివారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గుర్తింపు పొందిన యూనియన్లకు ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును కొందరు దుర్వినియోగం చేసినట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కొన్ని జిల్లా స్థాయి కమిటీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.

కులగణన చేయాల్సిందే

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జే శ్రీనివాస్‌గౌడ్

ఎదులాపురం, జూలై 27 : కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర కుల గణన చేపట్టి మాట నిలబెట్టుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. సమగ్ర కులగణన సాధన యాత్ర శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపించగానే కులగణన సాధ్యంకాదని ప్రభుత్వం ప్రకటించడం సరికాదని అన్నారు. సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 14 నుంచి కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు సమగ్ర కులగణన సాధన యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే సమగ్ర కులగణనను చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతామని వరంగల్ బహిరంగ సభలో రాహుల్ గాంధీ స్పష్టమైన హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోకపోతే ఆగస్టులో లక్ష మందితో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వేలేరు, జూలై 27: సాగు దిగుబడులు రాక.. అప్పుల బాధ తీరక మనస్తాపంతో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై కథనం ప్రకారం.. వేలేరు మండలం లో క్యాతండాకు చెందిన రైతు మురావత్ సాంబయ్య (34) రెండెకరాల్లో పత్తి, మక్క పంటలు సాగు చేస్తుంటాడు. వ్యవసాయానికి రూ.7 లక్షలు, కొడుకు వైద్యం కోసం మరో రూ.2 లక్షలు.. అప్పులయ్యాయి. వాటిని తీర్చే మార్గం కానరాక శుక్రవారం తన వ్యవసాయ బావి వద్ద సాంబయ్య పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా అప్పటికే సాంబయ్య మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

ట్రావెల్స్ బస్సులో 2.80 కోట్ల బంగారం చోరీ

కోహీర్, జూలై 27: ట్రావెల్స్ బస్సులో భారీగా బంగారం చోరీ అయింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ముంబైకి చెందిన నగల వ్యాపారి ఆశిష్ హైదరాబాద్‌లో రూ.2.80 కోట్ల విలువైన బంగారాన్ని కొనుగోలు చేశాడు. హైదరాబాద్ నుంచి ఆరెంజ్ సంస్థకు చెందిన ట్రావెల్స్ బస్సులో ముంబైకి పయనమయ్యాడు. శుక్రవారం రాత్రి జహీరాబాద్ సమీపంలోని సత్వార్ గ్రామ శివారులో ఉన్న కోహినూర్ దాబా వద్ద బస్సు ఆగింది. దీంతో ఆశిష్ బస్సులో నుంచి కిందకు దిగాడు. కొద్దిసేపటికి తిరిగి బస్సులోకి వెళ్లి చూసేసరికి బంగారంతో ఉన్న బ్యాగు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లినట్టు తెలిసింది. ఆశిష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నారాయణఖేడ్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

మనుషుల్లాగానే చింపాజీల సంభాషణ

న్యూఢిల్లీ, జూలై 27: చింపాంజీలు పరస్పరం మాట్లాడుకుంటాయని మీకు తెలుసా? అంతేకాకుండా అవి మనుషుల మాదిరిగా వ్యవహరిస్తాయని, వేగవంతమైన సంభాషణల స్థానంలో సైగలను చేసుకుంటాయని కొందరు పరిశోధకులు వెల్లడించారు. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూస్‌కు చెందిన గాల్ బదిహీ నేతృత్వంలోని కొందరు శాస్త్రజ్ఞుల బృందం పరిణామం కారణంగా మనుషులు, కోతులు పంచుకునే ప్రవర్తనా విధానాలపై పరిశోధనలు జరిపింది. 252 తూర్పు ఆఫ్రికా చింపాంజీలకు సంబంధించిన 252 వీడియోలను పరిశీలించిన తర్వాత మానవులు మాదిరిగా చింపాంజీలు ఒకదానితో మరొకటి సంభాషించుకుంటాయని నిర్ధారించడమే కాక, అవి 8,500 కన్నా ఎక్కువగా సంజ్ఞలను చేసుకున్నట్టు గుర్తించింది. వీటి డాటాను విస్తృతంగా విశ్లేషించి కమ్యూనికేషన్ సారూప్య నమూనాలను పరిశీలించడమే కాక, వాటి సంస్కృతుల మధ్య కమ్యూనికేషన్‌లో తేడాలను గుర్తించింది. కరెంట్ బయాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయన వివరాల ప్రకారం.. మానవులు సంభాషించే విధానం వందల సంవత్సరాల క్రితం మన పరిణామ చరిత్రలో చింపాంజీలతో విడిపోవడానికి ముందు ఉద్భవించి ఉంటుందని పేర్కొంది.

గురుకుల అభ్యర్థుల నిర్బంధం

- డౌన్‌మెరిట్ అమలు చేయాలని డిమాండ్
- డీఎస్‌ఎస్ భవన్ ముట్టడికి పిలుపు
- ఎక్కిడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- పలువురు అభ్యర్థుల హౌజ్ అరెస్టు

పోలీసుల అదుపులో ఉన్న గురుకుల అభ్యర్థులు

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): గురుకుల రిక్రూట్‌మెంట్‌లో డౌన్ మెరిట్‌ను అమలు చేసి, బ్యాక్‌లాగ్‌లు లేకుండా చూసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న గురుకుల అభ్యర్థులపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. ఎక్కడికక్కడ అరెస్టులకు తెగబడుతున్నది. గురుకుల నియామకంలో డౌన్ మెరిట్ విధానాన్ని అమలు చేయకపోవడం వల్ల నోటిఫికేషన్‌లో పేర్కొన్న 9,210 పోస్టుల్లో 3,000కు పైగా పోస్టులు మిగిలిపోయే ప్రమాదముందని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ విషయమై 4నెలలుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పలుమార్లు సీఎం ఇంటి ఎదుట కూడా నిరసనకు దిగారు. అయినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవడంతో శనివారం ఉదయం మాసాబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లోని ట్రిబ్ కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించారు. సమాచారం అందుకున్న పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా గురుకుల అభ్యర్థులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. మల్సూర్ యాదవ్, అస్మా, నవీన్ పట్నాయక్, శ్రీనివాస్, రజినీకాంత్ తదితర అభ్యర్థులను ముందస్తుగానే గృహనిర్బంధం చేశారు. అయినప్పటికీ పోలీసులను తప్పించుకుని 200మంది డీఎస్ఎస్ భవన్‌కు చేరుకున్నారు. 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అభ్యర్థులను బస్సుల్లో ఎక్కించి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి, సాయంత్రం విడుదల చేశారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

తగాదాల పరిష్కారానికి సీఎంవీల సేవలు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

కామారెడ్డి, జూలై 27: చిన్నపాటి తగాదాలను కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్ (సీఎంవీ)ల ద్వారా పరిష్కరించుకోవచ్చని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ తెలిపారు. ఇందుకోసం మీడియేషన్ యాక్ట్-2023ను ప్రభుత్వం తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. సామాజిక స్పృహ, సేవాభావం కలిగిన కొంతమందిని వలంటీర్లుగా ఎంపిక చేస్తున్నామని చెప్పారు. వీరంతా సామాజిక బాధ్యతతో తగాదాల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. శనివారం కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నచిన్న తగాదాలతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సామాజిక కార్యకర్తలు, పెద్దమనుషుల సమక్షంలో తగాదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు పనిచేయాలని సూచించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కారమైతే సమాజంలో మంచి వాతావరణం ఏర్పడుతుందని, అందుకోసం వలంటీర్లు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎస్పీ కార్యాలయ ఆవరణలో హైకోర్టు న్యాయమూర్తులు మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ పంచాక్షరీ, కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్, అడిషనల్ జిల్లా న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, ఎస్పీ సింధూశర్మ పాల్గొన్నారు.

గృహజ్యోతికి గ్రహణం

- అర్హులందరికీ ఉచిత కరెంటు ఉత్తదే
- బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్
- దరఖాస్తులను పరిశీలించకుండానే బిల్లుల వసూలు
- గృహజ్యోతికి అర్హులమని చెప్పినా
- బిల్లు చెల్లించాలని వేధింపులు
- సూర్యాపేట జిల్లాలో పేదల ఇండ్లకు కరెంట్ కట్

సూర్యాపేట, జూలై 27 (నమస్తే తెలంగాణ) : రేవంత్ సర్కారు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్తు పథకం క్షేత్రస్థాయిలో అబాసుపాలవుతున్నది. కాంగ్రెస్ ఆరు హామీల్లో ఒకటైన గృహజ్యోతి వేలాది మంది అర్హుల ఇండ్లల్లో వెలుగులు నింపలేకపోతున్నది. రెండు వందల యూనిట్లలోపు రీడింగ్ వచ్చే విద్యుత్తు వినియోగదారులకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని పైకి గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. గృహలక్ష్మి పథకం కోసం సూర్యాపేట జిల్లాలో 2,59,697 మంది విద్యుత్తు వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 1,64,479 మందిని అర్హులుగా ప్రకటించగా, మిగిలిన దరఖాస్తుల పరిశీలనను ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆమోదించడం లేదు. అదనంగా మరో 25 వేలకు పైగా దరఖాస్తులు అందినట్టు సమాచారం. ఈ లెక్కన జిల్లాలో దాదాపు 1.20 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వారం దరిని నాలుగు నెలలుగా విద్యుత్తు శాఖ బిల్లులు అడగడం లేదు. అంతా 200 యూనిట్ల రీడింగ్ ఉన్నవాళ్లే కావడంతో జీరో బిల్లు పరిధిలోకి వస్తామని భావించి వినియోగదారులు ధీమాగా ఉన్నారు. తీరా ఇప్పుడు విద్యుత్తు శాఖ బిల్లుల కోసం ఇంటి గడప తొక్కుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలది కలిపి రూ.2 వేల నుంచి రూ.3,600 వరకు బకాయి ఉన్నది, కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. అలా పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని చెల్లించని చాలామంది వినియోగదారుల ఇంటి కరెంట్ కనెక్షన్లను శనివారం విద్యుత్తు సిబ్బంది కట్ చేశారు. 200 యూనిట్లలోపే కరెంట్ వాడుతున్నామని చెబుతున్నా వినిపించుకోవడం లేదంటూ కాంగ్రెస్ సర్కారు తీరుపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఇదేం బిల్లో ఏమో.. కట్టలేక చావుకొస్తున్నది

తన ఇంటికి అడ్డగోలుగా వచ్చిన బిల్లును చూపిస్తున్న నజీర్‌పాషా

నేను దివ్యాంగుడిని. సూర్యాపేట పట్టణంలోని నిర్మల దవాఖాన ఎదురుగా ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నా. కాంగ్రెస్ ప్రభు త్వం ఉచిత కరెంట్ అమలు ప్రారంభించడానికి నెల ముందు వరకు కూడా గృహ వి నియోగ కనెక్షన్ ఎన్నడూ 100 యూనిట్లు దాటలేదు. రూ.500 లోపే బిల్లు వచ్చేది. ఇప్పుడు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వస్తున్నది. ఇదేందని కరెంటోళ్లను ప్రశ్నిస్తే మీరు ఎక్కువ కరెంట్ వాడుతున్నారని అంటున్నారు. కరెంట్ బిల్లు ఇంటి దగ్గరే వసూలు చేసి రశీదు కూడా ఇస్తలేరు. ప్రతి నెలా బిల్లు ఎక్కువ వస్తుందంటే.. మా దగ్గర ఎంత ఉంటే అంత కట్టించుకుని మిగతాది వచ్చే నెల కడుదువులే అని వెళ్తున్నారు. ఈ నెల కూడా రూ.4,695 బిల్లు వచ్చింది. దానికి సంబంధించి ఈ నెల 12న రూ.3,150 కట్టించుకున్నారు. మిగతాది వచ్చే నెల దాంట్లో కలిపి కట్టాలని చెప్పారు. శనివారం మధ్యాహ్నం వచ్చి చెప్పకుండానే కరెంట్ సరఫరా నిలిపివేశారు. జీరో బిల్లు మాట దేవుడెరుగు.. వచ్చే బిల్లు కట్టలేక చావుకొస్తున్నది.

– నజీర్ పాషా, సూర్యాపేట టౌన్

గ్యారెంటీలు అమలు చేయలేక మాపై నిందలా?

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శ

కరీంనగర్ విద్యానగర్, జూలై 27: కాంగ్రె స్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక కేంద్ర ప్రభుత్వం పై నిందలు వేస్తున్నదని కేంద్ర హోంశాఖ స హాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించా రు. శనివారం కరీంనగర్‌లోని వీ పార్కులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్షా తొమ్మిది వేల కోట్లకు పైగా నిధులను కేంద్రమే సమకూరుస్తుందని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారని, మరి పైసా లేదని తీర్మానం ఎట్లా చే స్తారని మండిపడ్డారు. అసెంబ్లీలో కేంద్రానికి వ్యతిరేకంగా తీర్మానం చేయడం దుర్మార్గమని విమర్శించారు. జీఎస్టీ ఆదాయంలో 74 శాతం సొమ్ము తిరిగి రాష్ట్రానికే ఇస్తుందని, గతంలో 32 శాతం ఉన్న డీ వ్యాల్యూషన్ ఫండ్‌ను 42 శాతానికి పెంచామని గు ర్తుచేశారు. ఆరు గ్యారెంటీలపై ఊసేదని ప్ర శ్నించారు. కాంగ్రెస్ 420 హామీలకు బడ్జెట్లో నిధులు ఎందుకు ప్రతిపాదించలేదని నిలదీశారు. రుణమాఫీకి రూ.35 వేల కోట్లు అవసరమని కాంగ్రెస్ వాళ్లే చెప్పారని, బడ్జెట్లో మాత్రం రూ.15 వేల కోట్లే ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. రైతు భరోసాపై క్లారిటీ లేదని చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, రాణి రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీ వేణుగోపాల్, జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ సుజన

సత్వర న్యాయానికి మరిన్ని కోర్టులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ వేణుగోపాల్

యాదగిరిగుట్ట, జూలై 27: సకాలంలో కేసుల పరిష్కారంతోపాటు అట్టడుగు వర్గాలకు సత్వర న్యాయం అందేలా మరిన్ని కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ వేణుగోపాల్ అన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని తులసీ కాటేజీ ప్రాంతంలో ఏర్పాటుచేసిన జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, వేగంగా మారుతున్న కాలంలో సోదరభావంతో మెలగడం ముఖ్యమని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట, రాజాపేట మండలాలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి యాదగిరిగుట్టలో కోర్టును ప్రారంభించినట్టు తెలిపారు. కేసుల పరిష్కారానికి త్వరలో శాశ్వత న్యాయమూర్తిని నియమించనున్నట్టు పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజన , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు, కలెక్టర్ హనుమంత్ కే జండగే, జడ్జీలు వీ మాధవీలత, డీ నాగేశ్వర్‌రావు, జీ కవిత, ప్రదీప్, ఎస్ చందన, ఎస్ సుమలత, మహతి, డీసీపీ రాజేశ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.